సాక్షి నిజామాబాద్

ఆదివారం । 29 । జూన్ । 2025



పోరుబాటలో ఎన్నో..

పంటలు సాగు చేయడమే కాదు, డిమాండ్ల కోసం ఉద్యమించి ప్రభుత్వా ల మెడలు వంచగల నేర్పరులు ఆర్మూర్ ప్రాంత రైతులు.

- 8లో ▸



ఆటకు దూరమైన..

పాఠశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేక చదువులకే అంకితమవుతున్నారు. ఫలితంగా పిల్లల జీవనశైలి మారుతోంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.8 /23.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రత్యేక పారిశుధ్య పనుల పరిశీలన



నిజామాబాద్ సిటీ: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆదివారం జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ పరిశీలించారు. శనివారం ఉదయం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కంఠేశ్వర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన డీఎస్ విగ్రహం, ఐలాండ్ పనులను పరిశీలించిన ఆయన.. పనులను వేగవంతం చేయాలని ఏఈ వాజీద్‌ను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ పరిసరాలను పరిశీలించి పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. కలెక్టరేట్ నుంచి కంఠేశ్వర్ బైపాస్, పాలిటెక్నిక్ గ్రౌండ్, ఆర్యనగర్‌లోని పసుపు బోర్డు కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ పనులు చేయించారు. పాలిటెక్నిక్ గ్రౌండ్ ప్రహరీ పక్కన ఉన్న పండ్ల బండ్లను తొలగింపజేశారు. రోడ్డుపై ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఏఎంసీ జయకుమార్, సూపర్‌వైజర్ సాజిద్, ఎస్‌ఐలు శ్రీకాంత్, షాదుల్లా, సునీల్, సాల్మ న్‌రాజ్ తదితరులున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అలాగే 14వ తేదీలోగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారుల వయస్సు 21 నుంచి 30 ఏళ్లలోపు ఉండి, ఏదైనా డిగ్రీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన దరఖాస్తుదారుల కుటుంబ సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతల వారికి రూ.2 లక్షల ఆదాయం మించొద్దని తెలిపారు.

ఉత్తమ టీచర్ అవార్డు కోసం..

నిజామాబాద్‌అర్బన్: జాతీయ ఉత్తమ టీచర్ అవార్డుల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో అశోక్ కోరారు. 2025 సంవత్సరానికి గాను అవార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేవారు సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. జూలై 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాల్పోల్ శివార్లలో ఎలుగుబంటి సంచారం



మోపాల్: మండలంలోని కాల్పోల్ శివారు అటవీప్రాంతంలో ఎలుగుబంటి సంచరిస్తోంది. ఈ మేరకు ఓ వీడియో శనివారం వైరల్ కావడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎలుగుబంటి సంచరిస్తున్న సమయంలో అటువైపు వెళ్లిన గ్రామస్తులు సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించారు. ఎలుగుబంటి సంచరిస్తోన్న విషయం వాస్తవమేనని, మంచిప్ప అటవీ ప్రాంత పరిసరాల్లోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు. అటవీప్రాంతం గుండా ఒంటరిగా వెళ్లొద్దని, ద్విచక్రవాహనదారులు, కార్లు నడిపేవారు హారన్ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



పసుపు బోర్డు కోసం 2019లో ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)



వినాయక్‌నగర్‌లో ప్రారంభానికి ముస్తాబైన పసుపు బోర్డు కార్యాలయ భవనం

రైతు ఉద్యమం.. పసుపు బోర్డు

- ఢిల్లీకి వినిపించిన రైతు నినాదం
- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 178 మంది రైతుల నామినేషన్‌లు
- ఈవీఎంలు పక్కన పెట్టి బ్యాలెట్ బాక్సు పద్ధతిలో ఎన్నికలు జరిపిన అధికారులు
- మోదీపైనా వారణాసిలో నామినేషన్లు వేసిన 25 మంది రైతులు, పోటీలో నిలిచిన ఏర్గట్ల రైతు ఇస్తారి
- రైతులకు బాండ్ రాసిచ్చిన అర్వింద్
- చివరికి అనుకున్నది సాధించుకున్న రైతన్నలు
- రైతు ఉద్యమాల్లో ప్రత్యేక గుర్తింపు

ఆర్మూర్: జిల్లాలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటులో ఆర్మూర్ ప్రాంత రైతాంగానిది కీలక పాత్ర. పసుపు బోర్డు కావాలనే నినాదాన్ని ఉద్యమంగా మల్చిన రైతులు అనుకున్నది సాధించారు. 2007లో స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో కోటపాటి నర్సింహనాయుడు పసుపు బోర్డు నినాదం ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతులు స్వచ్ఛందంగా పచ్చ కండువాలు భుజాన వేసుకుని ముందుకు కదిలారు. రైతులు జరిపిన ఉద్యమ తీవ్రతకు పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఏవైనా పసుపు బోర్డు అంశం కేంద్రంగానే నేతలు హామీలు ఇచ్చేలా పరిస్థితి వచ్చింది.

పసుపు పరిశోధన కేంద్రం, పసుపునకు గిట్టుబాటు ధర, పసుపునకు పొగాకు తరహాలో ప్రత్యేక బోర్డు.. ఈ మూడు నినాదాలతో పసుపు రైతుల సంఘం చేపట్టిన ఉద్యమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించింది. ఫలితంగా 2009లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య కమ్మర్‌పల్లిలో 36 ఎకరాల విస్తీర్ణంలో పసుపు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. పసుపు బోర్డు ఏర్పాటైతేనే తమకు గిట్టుబాటవుతుందని ఆశించిన రైతులు ఢిల్లీ వీధుల్లో సైతం పలు మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో గతేడాది అక్టోబర్‌లో మహబూబ్‌నగర్ వేదికగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రధాని నోట పసుపు బోర్డు ప్రకటన ఆర్మూర్ రైతులు ఏళ్లుగా జరిపిన ఉద్యమ విజయంగా చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల వేళ పసుపు బోర్డు సాధిస్తానంటూ రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్ రెండు పర్యాయాలు ఎంపీగా గెలవడం గుర్తు చేసుకోవాల్సిన అంశం. ఇది పసుపు రైతుల ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

ఏళ్లుగా సాగిన పోరాటం



వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై నామినేషన్లు వేయడానికి వెళ్తున్న రైతులు(ఫైల్)

రైతుల నామినేషన్లపై దేశవ్యాప్త చర్చ



మోదీపై పోటీ చేసిన ఇస్తారి

నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలనే తమ డిమాండ్ దేశమంతటికీ తెలియజేయాలనే ఉద్దేశంతో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు వేశారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానానికి మొత్తం 185 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, అందులో 178 మంది రైతులే ఉన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది. అదే విధంగా

ప్రధాని మోదీ పోటీ చేసిన వారణాసి (ఉత్తరప్రదేశ్) స్థానం నుంచి బరిలో నిలిచేందుకు 50 మంది రైతులు తరలివెళ్లారు. 25 మంది నామినేషన్లు వేయగా, వివిధ కారణాలతో 24 మందివి తిరస్కరణకు గురయ్యాయి. ఏర్గట్ల మండలానికి చెందిన రైతు ఇస్తారి ఎన్నికల బరిలో నిలిచారు. నరేంద్ర మోదీపై పోటీలో నిలిచిన ఇస్తారికి 711 ఓట్లు వచ్చాయి.

2007 ఎన్నికల నుంచే పసుపు బోర్డు నినాదం



పసుపు సాగు వ్యయం పెరిగి గిట్టుబాటు ధర లభించకపోవడంతో 2007లో చేపట్టిన ఉద్యమంలోనే మొదటి సారిగా పసుపు బోర్డు నినాదాన్ని తీసుకున్నాం. రైతుల ఉద్యమాలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషి తోడైంది. జిల్లా కేంద్రంలో జాతీయ కార్యాలయం ఏర్పాటు కా వడం ఈ ప్రాంత రైతుల విజయం.

– కోటపాటి నర్సింహనాయుడు, పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఆర్మూర్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎంపీ ధర్మపురి అర్వింద్ జిల్లా రైతాంగానికి ఇచ్చిన హామీని నెరవేరుస్తామని కేంద్ర మంత్రులతోపాటు బీజేపీ ముఖ్యులు పలుమార్లు ప్రకటించారు. ఇచ్చిన హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారు. పసుపు రైతుల సమస్యలను గుర్తించిన ప్రధాని నరేంద్ర మోదీతో పాటు బీజేపీ ప్రభుత్వానికి పసుపు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పల్లె గంగారెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్, అంకాపూర్, ఆర్మూర్ మండలం

నేడు ఇందూరుకు అమిత్ షా

- జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి
- బైపాస్ చౌరస్తాలో పీసీసీ మాజీ చీఫ్ డీఎస్ విగ్రహావిష్కరణ..
- పాలిటెక్నిక్ మైదానంలో కిసాన్ సమ్మేళన్
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎంపీ అర్వింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ముస్తాబైన కిసాన్ సమ్మేళన్ వేదిక

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రానికి నేడు (ఆదివారం) కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రానున్నారు. పసుపు రైతుల దశాబ్దాల కల అయిన పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. అమిత్ షా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు, ఇతర అంశాలపై కలెక్టర్, సీపీ సహా పసుపు బోర్డు అధికారులతో కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. మరోవైపు ఎంపీ అర్వింద్ ధర్మపురి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సైతం బీజేపీ శ్రేణులు, రైతు సంఘాలతో చర్చిస్తున్నారు. అమిత్ షా పర్యటన ఏర్పాట్లు చకచకా కొనసాగుతున్నాయి. నగరంలో భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి. డీఎస్ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో కాంస్య విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరించనున్నారు.

పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం అనంతరం పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కిసాన్ సమ్మేళన్(రైతు సమ్మేళనం) బహిరంగ సభలో షా పాల్గొననున్నారు. కేంద్ర హోంమంత్రి పర్యటనను పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలతోపాటు నిర్మల్, కామారెడ్డి, తదితర జిల్లాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులను తరలించేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. ముఖ్యంగా పసుపు రైతులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రైతు సమ్మేళన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. వర్షం కురిసినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

పర్యటన షెడ్యూల్..

అహ్మదాబాద్(గుజరాత్) ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఆదివారం ఉదయం బయల్దేరి హైదరాబాద్‌లోని బేగంపేట్‌కు అమిత్ షా చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీక్యాప్టర్ ద్వారా జిల్లాకేంద్రానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటారు. 2 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభించిన అనంతరం బస్వాగార్డెన్‌లో పసుపు బోర్డు అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. 3.30 గంటలకు డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించి, పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే రైతు సమ్మేళనంలో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభాప్రాంగణం నుంచి హెలీప్యాడ్ వద్దకు బయల్దేరుతారు.

భారీ బందోబస్తు

ఖలీల్‌వాడి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ పోతరాజు సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బలగాల సమన్వయంతో రెండు ఆక్టోపస్ టీమ్‌లు, గ్రేహౌండ్స్, స్నైపర్ టీమ్స్‌లతో పటిష్టమైన నిఘా వ్యవస్థ, బైనాక్యులర్లతో అనుక్షణం పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో స్పెషల్ పార్టీలు, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌తో బస్టాండ్, రైల్వే స్టేషన్, కల్వర్టులు రోడ్లు తదితర ప్రదేశాలలో తనిఖీ చేశారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ కేంద్ర మంత్రి పర్యటించే ప్రాంతాల్లో చుట్టూ పది కిలోమీటర్ల వరకు పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తుకు నిజామాబాద్ జిల్లాతో పాటు అదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల పోలీస్ సిబ్బంది, టీఎస్ఎస్‌పీ బెటాలియన్ సిబ్బంది మొత్తం 1300 మందిని వినియోగిస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు..

- పాలిటెక్నిక్ మైదానంలో జరిగే రైతు సమ్మేళనానికి డిచ్‌పల్లి నుంచి వచ్చే వాహనాలు మాధవనగర్ నుంచి గూపన్‌పల్లి రోడ్డు, గంగాస్థాన్ ఫేస్–2, ఖాజా హోటల్ నుంచి రోడ్డు చేరుకుంటాయి.
- ఆర్మూర్ నుంచి వచ్చే వాహనాలు గంగాస్థాన్ ఫేజ్–2, ఖాజా హోటల్ నుంచి వెళ్తాయి. రైతుల వాహనాలను మహిళా కాలేజీ గ్రౌండ్, వీఐపీల వాహనాలను హెచ్‌పీఎస్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేస్తారు.
- డిచ్‌పల్లి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు వినాయక్‌నగర్ నుంచి బస్టాండ్‌కు చేరుకుంటాయి. ఆర్మూర్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు గిరిరాజ్ కాలేజీ, దుబ్బ, రైల్వే ఓవర్ బ్రిడ్జి, బస్టాండ్‌కు చేరుకుంటాయి. ఆర్యనగర్‌లో పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభ సమయంలో వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేయనున్నారు. తర్వాత యథావిధిగా కొనసాగుతాయి.

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలి

- వన మహోత్సవానికి సమగ్ర ప్రణాళికతో సమాయత్తం కావాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: వన మహోత్సవం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటాలని, సమగ్ర ప్రణాళికతో సమాయత్తమై సమష్టిగా కృషి చేయాలని కావాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమయాత్తం సమీక్షించారు. గతేడాది నాటిన మొక్కల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందించాలని అన్నారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొక్కలు నాటిన ప్రతి చోట వివరాలతో కూడిన నేమ్ బోర్డు ఉండాలన్నారు. మొక్కల పంపిణీ కోసం నర్సరీలను సిద్ధం చేస్తూ, వాటిని నాటేందుకు నిర్దేశిత ప్రదేశాల్లో గుంతలు తవ్వించాలని అన్నారు. బ్లాక్ ప్లాంటేషన్‌లో విద్యార్థులను భాగస్వాములు చేయాలని, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించాలని ఆదేశించారు. 'ఫ్రైడే – డ్రై డే' ప్రతి చోటా అమలయ్యేలా చూడాలని అన్నారు. ఈ నెలాఖరు వరకు ఎల్ఆర్ఎస్ రాయితీ అమలులో ఉన్న నేపథ్యంలో అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో స్పష్టమైన ప్రగతి కనిపించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, హౌసింగ్ అధికారి నివర్తి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, డీసీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్ మార్పు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించాల్సిన పాలిసెట్ కౌన్సెలింగ్‌ను పక్కనే ఉన్న ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్‌షా కార్యక్రమాల నేపథ్యంలో కౌన్సెలింగ్ స్థలాన్ని మార్చినట్లు తెలిపారు. విద్యార్థులు గమనించాలని ఆమె సూచించారు.

రైతుల 30 ఏళ్ల కల పసుపు బోర్డు

- ఎంపీ అర్వింద్ కృషితో సాకారమైంది
- రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి



మాట్లాడుతున్న బంగారు శృతి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్

సుభాష్‌నగర్: రైతుల 30 ఏళ్ల పసుపు బోర్డు కల నెరవేరిందని, స్పైసెస్ బోర్డు నుంచి పసుపు బోర్డు వేరు చేసి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడంలో ఎంపీ అర్వింద్ ధర్మపురి కృషి ఎంతో ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ పరిశీలకురాలు బంగారు శృతి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ ఎంతో శ్రమించి పసుపు బోర్డును సాధించారని, రైతులు ఢిల్లీ వెళ్లే శ్రమ లేకుండా పసుపు బోర్డు జాతీయ కార్యాలయాన్ని నిజామాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవం, రైతు సమ్మేళన కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డు తెలంగాణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పరిశ్రమల రాకతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ బోర్డు ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేస్తే ప్రతిపక్షాలు అవహేళన చేశాయని గుర్తుచేశారు. కానీ అర్వింద్ అవేవీ పట్టించుకోకుండా పట్టుబట్టి విక్రమార్కుడిలా పసుపు బోర్డును సాధించడంతోపాటు జిల్లాలోనే కార్యాలయం ఏర్పాటయ్యేలా, చైర్మన్‌గా జిల్లా రైతు బిడ్డనే నియమించేలా కృషి చేశారని కొనియాడారు. వ్యవసాయ రంగానికి ఇందూరు కేంద్ర బిందువు కానుందన్నారు. అవహేళన చేసిన వారి కళ్లు చెదిరిపోయేలా బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతున్నారని పేర్కొన్నారు.

పసుపు బోర్డు జాతీయ కార్యాలయం ప్రారంభోత్సవం, రైతులతో ముఖాముఖీ, కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహావిష్కరణ, పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో రైతు సమ్మేళన కార్యక్రమం ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి వివరించారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు, పసుపు బోర్డు ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి, నాయకులు ప్రకాశ్‌రెడ్డి, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్సారెస్పీని సందర్శించిన ఆర్మీ బృందం



వివరాలు తెలుసుకుంటున్న ఆర్మీ ఇన్‌స్పెక్టర్ నీతూ రామ్

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయాన్ని ఆర్మీ ప్రత్యేక బృందం శనివారం సందర్శించింది. ఆర్మీ సబ్ ఇన్‌స్పెక్టర్ నీతూ రామ్ ఆధ్వర్యంలోని బృందం ప్రాజెక్ట్‌లోకి ఒకేసారి భారీ వరద వచ్చి ముంపు తలెత్తితే ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, బెటాలియన్ బృందాలు చేపట్టాల్సిన చర్యలపై పరిశీలించారు. గతంలో ప్రాజెక్ట్‌లోకి వచ్చిన వరదల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ భద్రతతోపాటు దిగువన ఉన్న గ్రామాల ప్రజలను ఎలా సురక్షితంగా కాపాడవచ్చో పరిశీలించారు. వారి వెంట ప్రాజెక్ట్ ఏఈఈ అక్తర్, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయశాఖ మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రిని సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేశ్ రెడ్డి

సుభాష్‌నగర్ : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులకు వానాకాలం పంట పెట్టుబడి సాయంగా రైతు భరోసా అందించినందుకు జిల్లా రైతాంగం తరఫున మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో యూరియా కొరతపై మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించిన మంత్రి.. అవసరం మేరకు యూరియాను అందుబాటులో ఉంచుతామని హామీనిచ్చినట్లు చైర్మన్ తెలిపారు.

కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించినట్లు ప్రిన్సిపల్ బుద్దిరాజ్ తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో నామ్‌దేవ్‌వాడ ప్రాంతంలో ఎస్సీ వసతి గృహంలో వసతి కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మొదటి సంవత్సరం విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు.

నిజామాబాద్ సీసీఆర్‌బీ ఏసీపీ బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న అంబటి రవీందర్‌రెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 44 మంది డీఎస్పీలు బదిలీలు జరిగాయి. ఏసీపీ రవీందర్‌రెడ్డిని సైబరాబాద్‌లోని సైబర్ క్రైమ్ ఏసీపీగా బదిలీ అయ్యారు. నిజామాబాద్ ఎస్బీ సెక్యూరిటీ ఏసీపీగా సత్యనారాయణ బదిలీపై రానున్నారు. ఆయన గద్వాల జిల్లాలో ఎస్‌డీపీవో ఉండగా హైడ్రా ఏసీపీగా పనిచేస్తున్నారు. ఎస్‌బీ ఏసీపీగా పనిచేసిన శ్రీనివాస్‌రావు డీసీపీగా పదోన్నతిపై వెళ్లడంతో కొన్ని రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది.

పోరుబాటలో ఎన్నో విజయాలు..

- ప్రభుత్వాలను ఒప్పించి డిమాండ్లు సాధించే నేర్పరులు ఆర్మూర్ రైతులు
- ఐకమత్యంలో ఆదర్శం
- ఎర్రజొన్న, రుణమాఫీ, లిఫ్ట్ సాధన



2003 సంవత్సరంలో గుత్ప ఎత్తిపోతల పథకం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతులు (ఫైల్)

ఆర్మూర్ : వ్యవసాయ క్షేత్రంలో ఆరుగాలం శ్రమించి పంట పండించడమే కాదు, తమ డిమాండ్‌ల సాధనకు అవసరమైతే ఉద్యమించి ప్రభుత్వాల మెడలు వంచి ఒప్పించగల నేర్పరులు ఆర్మూర్ ప్రాంత రైతులు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీల ఆధ్వర్యంలో పోరాడి డిమాండ్లు సాధించుకుంటున్నారు. రైతుల ఉద్యమాల ఫలితంగానే 2003లో అర్గుల రాజారాం(గుత్ప) ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అడుగులుపడ్డాయి. 2008లో ఎర్రజొన్న వ్యాపారి చేతిలో మోసపోయిన రైతులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.35 కోట్లు చెల్లించింది. 2009లో అప్పటి సీఎం రోశయ్య కమ్మర్‌పల్లిలో పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశారు. 2024 ఆగస్టులో ప్రధాని నరేంద్ర మోదీ పసుపు బోర్డును తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ విజయాలన్నింటి వెనక రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో పోరాటాలు చేసిన రైతులే ఉన్నారు.

పసుపు పరిశోధనకు..

2007లో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరద్ పవార్ సూచన మేరకు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం సహకారంతో 2009లో కమ్మర్‌పల్లిలోని 36 ఎకరాల్లో పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని అప్పటి సీఎం రోశయ్య ప్రారంభించగా శాస్త్రవేత్తలు ఇక్కడ కొత్త వంగడాలను సృష్టిస్తూ పసుపు పంట పండించడంలో రైతులకు మెళకువలు నేర్పుతున్నారు.

బోర్డు కోసం ఢిల్లీ వరకు..

పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేశారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు 2018–19లో ఉద్యమ బాటపట్టారు. ఫలితంగా బీజేపీ ప్రభుత్వం పసుపునకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

సాధించి చూపారు..

నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతమైన ఆర్మూర్, బాల్కొండకు సాగు నీరందకపోవడంతో గుత్ప ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోతల ద్వారా ఆర్మూర్‌కు తీసుకురావడం సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వాలు పేర్కొడంతో 2003లో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమించి ఎత్తిపోతల పథకాన్ని సాధించుకున్నారు. రైతులు చేసిన ఉద్యమానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కదలి వచ్చి రూ. 204 కోట్లతో అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసింది. 2008 మార్చి 18న గుత్ప ఎత్తిపోతల పథకం పూర్తికావడంతో ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని 38,792 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.

ఆమరణ నిరాహార దీక్షతో..



2008లో ఎర్రజొన్న డబ్బుల కోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతులు (ఫైల్)

2008లో ప్రైవేటు సీడ్ వ్యాపారి చేతిలో మోసపోయిన ఎర్రజొన్న రైతులు తమ బకాయిలు రాబట్టుకోవడానికి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. రైతు నాయకులు చేసిన ఆరు రోజుల దీక్ష హింసాయుతంగా మారడంతో రైతులపై పోలీసు కాల్పులకు దారి తీసింది ఈ ఘటన. దీంతో నాటి ప్రభుత్వం రైతులకు రూ.35 కోట్లు రైతులకు చెల్లించింది. మిగిలిన రూ. 10 కోట్ల బకాయిలను 2014లో కేసీఆర్ ప్రభుత్వం చెల్లించింది.



ఆర్మూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎర్రజొన్న రైతులు (ఫైల్)

రూ.2 లక్షల రుణమాఫీ కోసం..

2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా రూ. రెండు లక్షల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలంటూ పోరాడారు. డిమాండ్లు సాధించుకోవడంలో ఆర్మూర్ ప్రాంత రైతులు ఉద్యమ పంథాను ఎంచుకొని ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు, వంటా వార్పు తదితర నిరసన కార్యక్రమాలతో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంటున్నారు.

క్యూసెక్కు, టీఎంసీ అంటే..



గోదావరిలోకి ప్రవహిస్తున్న నీరు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి క్యూసెక్కుల వరద నీరు, టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొంటారు. అసలు క్యూసెక్కు, టీఎంసీ అనే పదాల పూర్తి అర్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

మీకు తెలుసా?

- క్యూసెక్కు అనేది నీటి ప్రవాహ వేగాన్ని కొలిచే ప్రమాణం. క్యూబిక్ ఫీట్ పర్ సెకండ్(క్యూసెక్). ఒక సెకను కాలంలో 28 లీటర్ల నీరు వచ్చి చేరడం, లేదా విడుదలవ్వడం.
- క్యూసెక్కును ప్రాజెక్ట్‌లోకి వచ్చే ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలో వినియోగిస్తారు.
- టీఎంసీ అంటే థౌసండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్ (శత కోటి ఘనపుటడుగులు) అని అర్థం.
- ఒక్క టీఎంసీకి 2831 కోట్ల లీటర్ల నీరు.
- ప్రాజెక్ట్‌లోకి వచ్చే నీటిని, వదిలిన నీటికి క్యూసెక్కుల్లో తెలుపుతారు. పూర్తి నీటి నిల్వ, నీటి విడుదలను టీఎంసీల్లో చూపుతారు.
- వెయ్యి అడుగుల వెడల్పు, వెయ్యి అడుగుల పొడవు, వెయ్యి అడుగుల ఎత్తులో ఉండే నీరు ఒక టీఎంసీ అవుతుంది.
- 2300 ఎకరాల్లో ఒక్క అడుగు నీరు నిల్వ ఉంటే టీఎంసీకి సమానం.

– బాల్కొండ

లైసెన్స్ లేకుండానే విత్తనాల విక్రయం

- రైతులను మోసగిస్తున్న పెస్టిసైడ్ వ్యాపారులు
- తనిఖీ చేసి నోటీసులు ఇచ్చిన ఏవో
- ఏసీబీ అధికారుల పేరిట ఏవోకు బెదిరింపులు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో కొందరు పెస్టిసైడ్ వ్యాపారులు లైసెన్స్ లేకుండానే విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసగిస్తున్నారు. అలాంటి దుకాణాలపై ఫిర్యాదు రావడంతో వ్యవసాయ అధికారులకు తనిఖీ చేపట్టి ఓ దుకాణాదారుడికి నోటీసులు ఇచ్చారు. దీంతో ఆ పెస్టిసైడ్ దుకాణ యజమాని ఏసీబీ అధికారులతో తనకు సత్సంబంధాలున్నాయంటూ ఏకంగా మండల వ్యవసాయ శాఖ అధికారినే బెదిరించినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా ఇతర దుకాణాదారులు వ్యాపారం ఎలా చేస్తారో చూస్తానంటూ వారినీ బెదిరించినట్లు సమాచారం. కాగా, గతేడాది బిచ్కుంద ఏవో పోచయ్య పెస్టిసైడ్ దుకాణం లైసెన్సు రెన్యూవల్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులు చిక్కాడు. వ్యాపారులు ఇదే అదునుగా భావించి కొందరు అధికారులను ఏసీబీ పేరుతో బెదిరించి అక్రమ వ్యాపారాలకు పాల్పడుతున్నారు. దీంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలి..

విత్తన విక్రయాల లైసెన్సు ఉన్న దుకాణంలోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే ఒరిజినల్ బిల్లులు ఇస్తారు. దీంతో మొలకలు, పూత రాకుంటే కంపెనీ నుంచి రైతులు నష్టపరిహారం పొందే అవకాశాలు ఉంటాయి. లైసెన్సు లేని దుకాణంలో విత్తనాలు కొంటే పరిహారం పొందే అవకాశాలు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా..

లైసెన్సు లేకుండా ఓ పెస్టిసైడ్ దుకాణదారుడు విత్తనాలు విక్రయిస్తున్నాడు. తనిఖీ చేసి నోటీసులు ఇచ్చాం. ఆగ్రహంతో ఆ దుకాణదారుడు నా ముందే ఏసీబీ అధికారులకు ఫోన్ చేసి నన్ను బెదిరిస్తున్నాడు. ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. – అమర్ ప్రసాద్, ఏవో బిచ్కుంద

ఎంఆర్‌టీ అండ్ కన్‌స్ట్రక్షన్ డీఈగా వెంకటరమణ



వెంకటరమణను సన్మానిస్తున్న ఏడీఈలు, ఏఈలు

సుభాష్‌నగర్: నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్ విభాగం డీఈగా డీ వెంకటరమణ శనివారం పవర్‌హౌస్‌లో బాధ్యతలు స్వీకరించారు. నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో ఎంఆర్‌టీ, కన్‌స్ట్రక్షన్ విభాగం పునర్ వ్యవస్థీకరణలో భాగంగా విలీనం చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన డీఈని డివిజన్ ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, జేఏవోలు, ఓఎం స్టాఫ్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఈలు తోట రాజశేఖర్, నటరాజ్, ఏఈలు కాశీనాథ్, దుర్గాప్రసాద్, నవీన్‌రెడ్డి, మౌనిక రెడ్డి, సాయిలు, గయాస్ హైమద్, భాస్కర్, ప్రసాద్, వివిధ సెక్షన్ల ఓఎం స్టాఫ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో జిల్లా విద్యార్థినుల ప్రతిభ



తిరుమలలో ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులు

నిజామాబాద్ రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో జిల్లా కేంద్రానికి చెందిన సిద్ధార్థ కళాక్షేత్రానికి చెందిన జయలక్ష్మి ఆధ్వర్యంలో 27 మంది విద్యార్థినులు భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తేనె సాయిబాబా ఆలయంలో ప్రతి ఆదివారం కూచిపూడి, భరతనాట్యం క్లాసులు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నిర్వహించిన పోటీలు ముగించుకొని విద్యార్థినులు ఆదివారం జిల్లాకు చేరుకోనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి 3, 519 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడంతో ఎస్సారెస్పీలోకి వరద నీరు రాక తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి 3, 519 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 286 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1064.5(15.4 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఆటకు దూరమైన చిన్నారి లోకం

- ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు
- పీఈటీలు ఉన్నా సామగ్రి కరువు
- ప్రైవేట్ పాఠశాలలో క్రీడా మైదానాల కొరత
- పల్లె, పట్టణాల్లో పేరుకే క్రీడా ప్రాంగణాలు
- ఫలితంగా సెల్‌ఫోన్‌లకు బందీలుగా పిల్లలు





నిజామాబాద్‌నాగారం: ఆటా..పాటా లేక చిన్నారి లోకం ఉసూరుమంటోంది. ఆడుకోవాల్సిన వయసులో పిల్లలు స్మార్ట్ ఫోన్‌లకు బందీలవుతున్నారు. పాఠశాలల్లో సరైన క్రీడా మైదానాలు, వసతులు లేక చదువులకే అంకితమవుతున్నారు. ఫలితంగా పిల్లల జీవనశైలి మారుతోంది. ఆటలు దూరంగా ఉండడంతో మానసిక, శారీరక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ప్రైవేటులో అంతంత మాత్రమే..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1171 ఉండగా, ప్రైవేట్ పాఠశాలలో 475 ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో 80 శాతానికి పైగా క్రీడా మైదానాలు ఉన్నాయి. ఇందులో పీఈటీలు ఉన్నారు. అయితే క్రీడా సామగ్రి లేకపోవడంతో అంతంత మాత్రంగానే ఆటలు ఆడిస్తున్నారు. ఇక 90 శాతం ప్రైవేట్ పాఠశాలలు క్రీడా మైదానాలు లేకుండానే కొనసాగుతున్నాయి. ఫలితంగా పాఠశాలలో విద్యార్థులకు ఆటలు కరువయ్యాయి. ప్రైవేట్ పాఠశాలలో పేరుకు మాత్రమే పీఈటీలను తీసుకొని నవంబర్, డిసెంబర్‌లల్లో తొలగిస్తున్నారు.

బోర్డులే మిగిలాయి..

గత ప్రభుత్వం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలల్లో క్రీడా ప్రాంగణాలను డీఆర్‌డీఏ, పంచాయితీరాజ్ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. జిల్లా యువజన క్రీడల కార్యాలయానికి కేటాయించలేదు. ప్రాంగణాల్లో బోర్డులు మాత్రమే మిగిలాయి. క్రీడా పరికరాలు లేవు. జిల్లాలోని కమ్మర్‌పల్లి, వేల్పూర్, బోధన్, జక్రాన్‌పల్లి, నాగారం, ఆర్మూర్ తదితర ప్రాంతాల్లో మినీ స్టేడియాలు ఉన్నా పరికరాలు, కోచ్‌లు లేరు.

సమయం కరువు..

నిత్యం ఉదయం, సాయంత్రం ఆటలు ఆడే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన పిల్లలు మాత్రం ఎంతో కొంత ఆటలు ఆడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఆటలు ఆడే పరిస్థితి పదుల సంఖ్యలో మాత్రమే కనిపిస్తుంది. యాజమాన్యాలు చిన్నప్పటి నుంచే ర్యాంకుల పేరుతో పిల్లలపై చదవాలని ఒత్తిడి పెంచుతున్నారు. తల్లిదండ్రులకు సైతం క్రీడల కన్నా చదువుపైనే ఫోకస్ పెట్టాలని పట్టుబడుతున్నారు. దీంతో చాలా మంది పిల్లలు ఆన్‌లైన్‌లో చదువుకుంటున్నామని చెప్పి వీడియో గేమ్స్, బొమ్మలు, రీల్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు.

స్మార్ట్ ఫోన్లలో ఆటలు..

మూడేళ్ల వచ్చే పిల్లల నుంచి పాఠశాల, కళాశాల స్థాయి చదివే విద్యార్థుల వరకు స్మార్ట్ ఫోన్‌లకు బందీలవుతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి అని తేడా లేకుండా ఫోన్‌లకు అతుక్కపోతున్నారు. ఫోన్ ఇస్తేనే అన్నం తింటామని మారాం చేస్తున్నారు. సెలవుల సమయంలో గంటల తరబడిగా ఫోన్‌లు లేదంటే టీవీలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు.

పిల్లలను కచ్చితంగా ఆడించాలి

చిన్నప్పటి నుంచే పిల్లలకు నచ్చిన ఆటలో మెళకువలు నేర్పించాలి. పాఠశాలలో క్రీడలు ఆడితేనే భవిష్యత్తులో మంచి క్రీడాకారునిగా తయారవుతారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుంది. వ్యసనాలకు దూరంగా ఉంటారు. చదువు ఎంత ముఖ్యమో క్రీడలూ అంతే ముఖ్యం. కచ్చితంగా ఆడించాలి.

– ముత్తెన్న, జిల్లా యువజన క్రీడల అధికారి

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలం లింబూర్ గ్రామానికి చెందిన కిస్వే సంజయ్(45) శనివారం కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విజయ్‌కొండ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింబూర్‌కు చెందిన సంజయ్ మహారాష్ట్రలోని పుణె నగరంలో కుటుంబసభ్యులతో కలిసి కూలీ పని చేసేవాడు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న సంజయ్.. చికిత్స కోసం చాలా ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదని కుటుంబసభ్యులు చెప్పారు. దీంతో 15 రోజుల క్రితం సొంతూరికి వచ్చి కూలీ పని చేసుకుంటున్నాడు.

కడుపునొప్పి తీవ్రం కావడంతో శనివారం లింబూర్ శివారులో రోడ్డు పక్కన చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జీవితంపై విరక్తితో రైలుకు ఎదురెళ్లి ..



జాదవ్ శివతేజ మృతదేహం

ఖలీల్‌వాడి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై చెప్పిన ప్రకారం.. నగరంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన జాదవ్ శివతేజ(19) శనివారం ఉదయం 8.50 గంటల సమయంలో జీవితంపై విరక్తి చెంది రైలుకు అడ్డుగా వెళ్లి బలవన్మరణం చెందాడు. నిజామాబాద్ స్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడు నగరంలోని తిలక్‌గార్డెన్ వద్ద ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్‌లోని అశోక్ టీ పాయింట్‌లో పని చేసేవాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బీబీపేట: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామ శివారులో ఉన్న కూడవెల్లి వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కూడవెల్లి వాగులో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం వాగు నీటిలో ఉందని సమాచారం అందడంతో పోలీసులు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహంపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, బ్లాక్ కలర్ షర్ట్ ఉందని, మృతుడి ఒంటిపై టాటూలు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలోని ఫ్రీజర్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712686157 (ఎస్సై), 8712686153 (సీఐ) నంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.

చెరువులో పశువుల కాపరి గల్లంతు

మాక్లూర్: మండలంలోని గుత్ప మొద్దుల చెరువులో శనివారం సాయంత్రం పశువుల కాపరి బాబన్న (60) గల్లంతయ్యారు. గ్రామస్తుల కథనం మేరకు.. పశువులను మేతకు తీసుకెళ్లిన బాబన్న సాయంత్రం పశువులను తాగునీటి కోసం చెరువులోనికి దించాడు. పశువులు చెరువులో నుంచి ఎంతకూ బయటకు రాకపోవటంతో బాబన్న చెరువులోనికి దిగాడు. వాటిని బయటకు తీసే క్రమంలో చెరువులో మునిగిపోయాడు. గట్టుపై బాబన్న భార్య కేకలు వేస్తుండగానే నీటమునిగాడన్నారు. మాక్లూర్ పోలీసులకు సమాచారం అందించడంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

అటవీ భూమిని దున్నుతున్న ట్రాక్టర్ పట్టివేత




పట్టుకున్న ట్రాక్టర్‌తో అటవీ శాఖ అధికారులు

సిరికొండ: సిరికొండ అటవీ రేంజ్ తూంపల్లి సెక్షన్ గుడిలింగాపూర్ తూర్పు బీట్ పరిధిలో అటవీభూమిని దున్నుతున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రేంజర్ రవీందర్ తెలిపారు. గుడిలింగాపూర్‌కు చెందిన మలావత్ మంగికి చెందిన ట్రాక్టర్‌ను సీజ్ చేసి సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. అటవీ భూమిని అక్రమంగా దున్నడం నేరమని ట్రాక్టర్ యజమానికి గతంలో నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులను బేఖాతరు చేస్తూ అటవీ భూమిని దున్నుతుండటంతో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో డిప్యూటీ రేంజర్ గంగారం, సెక్షన్ అధికారి కృష్ణగీత్, బీట్ అధికారులు నాగేశ్, రీజేందర్, నవీన్, హరీశ్ పాల్గొన్నారు.

స్కూటీ, బైక్ ఢీ..

- నలుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కామారెడ్డి క్రైం: ఎదురెదురుగా వచ్చిన స్కూటీ, బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫామ్ రోడ్డుపై శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎక్కువగా గూడ్స్ రైళ్లు నిలిచే మూడో నెంబరు ప్లాట్‌ఫాం వెంబడి కోర్టు రోడ్డు నుంచి అశోక్‌నగర్ వరకు వాహనాల రాకపోకలకు వీలుగా రోడ్డును నిర్మించారు. కొంతకాలంగా ఈ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఇదే దారిపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వేగంగా వచ్చిన స్కూటీ, బైక్‌లు ఢీకొన్నాయి. రెండు వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వారిని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన శ్రీధర్, మురారి, బొంతల లెనిన్, లోకేశ్‌గా గుర్తించారు. వారిలో లెనిన్, లోకేశ్‌లు మైనర్లుగా తెలుస్తోంది. శ్రీధర్, మురారిల కుటుంబాలు ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి మేస్త్రీ పనులు చేసుకుంటున్నాయి. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.